సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 17 । మే । 2025



పనులు పూర్తయ్యేనా..?

ఆఫ్‌షోర్‌పై ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పనులు ఎప్పటికి పూర్తవుతాయో అని స్థానికులు అంటున్నారు.

- IIలో

● కూలిన సూపర్‌పాస్ వంతెన



మండలంలోని ఆనందపురం నుంచి పాత్రునివలస జాతీయ రహదారికి వచ్చే మార్గంలో వంశధార కాలువపై ఉన్న సూపర్‌పాస్ వంతెన శుక్రవారం ఉదయం కూలిపోయింది. మోటార్లు తరలించే లారీ ఈ మార్గం గుండా వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోయినప్పటికీ ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే హరిదాసుపురం, మాదిగాపురం, ఆనందపురం గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 26 ఏళ్ల కిందట నిర్మించిన ఈ సూపర్‌పాస్ వంతెన కింద నుంచి వంశధార నీరు, వంతెన పై నుంచి ఆనందపురం కొండ నుంచి ఊర చెరువుకు వచ్చే నీరు ప్రవహిస్తుంటుంది. రాకపోకలు నిలిచిపోకుండా అధికారులు తక్షణం తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని ఆనందపురం గ్రామస్తులు కోరుతున్నారు.

– నందిగాం

న్యూస్‌రీల్

డెంగీ నిర్ధారణకు ఎలీసా టెస్టు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ అనిత, పక్కనే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

అరసవల్లి: డెంగీ వ్యాధి నిర్ధారణకు ఎలీసా పరీక్షలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా డెంగీ జ్వరాలపై ప్రజల్లో అవగాహన రావాలని, అలాగే అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఇదే క్రమంలో డెంగీ నివారణ కోరుతూ అవగాహన ర్యాలీని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత జెండా ఊపి ప్రారంభించగా, కలెక్టర్‌తో పాటు అధికారులంతా కలిసి ర్యాలీగా ఏడు రోడ్ల కూడలి వరకు వెళ్లి ప్రతిజ్ఞ చేశారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పూటకో ఆలోచన.. రోజుకో నిర్ణయాలతో సాగుతున్న విద్యాశాఖను ప్రక్షాళన చేయాలని, ప్రభుత్వ బడులను పరిరక్షించాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి గ్రామంలో ప్రతిపాదిత ఫౌండేషన్ స్కూల్ స్థానంలో 1 నుంచి 5 తరగతుల ప్రాథమిక పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలన్నారు. ప్రతిపాదిత మోడల్ ప్రాథమిక పాఠశాలలకు పీఎస్‌హెచ్‌ఎంలను నియమించాలని, ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని, ఎస్ఎంసీ తీర్మానం లేకుండా మెర్జింగ్ చేయకూడదని పేర్కొన్నారు.

● మరమ్మతులు..
పైసలు దోచే గమ్మత్తులు



పాతపట్నం–మెళియాపుట్టి ఆల్ ఆంధ్రా రోడ్డు ఇది. దీనికి మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.51లక్షలు ఖర్చు పెట్టారు. మంత్రి అనుచరుడు మరమ్మతుల కాంట్రాక్ట్ తీసుకున్నాడు. వేసిన కొన్ని రోజులకే మళ్లీ రాళ్లు తేలిపోయాయి. రోడ్డు గుంతలయమైంది. నాసిరకం పనులు చేపట్టడంతో దాదాపు అరకోటి నిధులు కాంట్రాక్టర్ పాలైన పరిస్థితి ఏర్పడింది.



ఈ రోడ్డు మరమ్మతులు ఎలా చేశారో చూడండి. ఇచ్ఛాపురం మండలం తులసిగాం నుంచి కేశుపురం వరకు పాడైన రోడ్డును మరమ్మతు చేసేందుకు రూ.15లక్షలు ఖర్చు పెట్టారు. పనులు చేసిన కొన్ని రోజులకే ఆ రోడ్డు గుంతలై రాళ్లతో తేలిపోయింది.



పాతపట్నం నుంచి తెంబూరుకు మరమ్మతులు చేపట్టిన రెండు నెలలకే రాళ్లు తేలి గుంతలమయమైన రోడ్డు ఇది. సుమారు రూ.5లక్షలు ఖర్చు చేశారు. కానీ ప్రయాణికులకు వెతలు తప్పడం లేదు.

- నాయకుల జేబుల్లోకి రోడ్ల మరమ్మతుల నిధులు
- కాంట్రాక్టర్లగా అవతారమెత్తిన తమ్ముళ్లు
- నాసిరకంగా పనులు
- ఉపాధి రోడ్ల మాదిరిగానే మరమ్మతుల రోడ్లలోనూ చేతివాటం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో రోడ్డు మరమ్మతులు భలే గమ్మత్తుగా సాగుతున్నాయి. తెలుగు తమ్ముళ్లే కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తడంతో పనుల్లో నాణ్యత గంగలో కలిసిపోయింది. మరమ్మతులే కదా.. పనులు ఎలా చేసినా ఫర్వాలేదనుకుని నాసిరకంగా చేశారు. దీంతో మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే మళ్లీ రోడ్లు పాడైపోయి నరకం చూపిస్తున్నాయి. ఉమ్మడి పనులతో టీడీపీ కాంట్రాక్టర్ల జేబులు నిండాయే తప్ప రోడ్లు బాగు పడలేదు.

రూ.31కోట్ల పనులపై నాసిరకం ప్రభావం..

జిల్లాలో రూ.31కోట్లతో 938 కిలోమీటర్ల మేర రోడ్లు మరమ్మతులు చేపడుతున్నట్టు యంత్రాంగం ప్రకటించింది. పనులన్నీ దాదాపు పూర్తి చేసినట్టు రిపబ్లిక్ డే రోజున ప్రకటించడం కూడా జరిగింది. అయితే మరమ్మతులు చేసిన రోడ్లను ఒకసారి పరిశీలిస్తే అంతకుముందు.. తర్వాత పరిస్థితులకు ఏ మాత్రం తేడా కనబడటం లేదు. మరమ్మతులు చేపట్టకముందు ఎలా ఉన్నాయో ఇప్పుడలానే దర్శనమిస్తున్నాయి. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లే ఆ పనులు దక్కించుకోవడంతో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. అడిగే వారు ఉండరని తాము చేసేవే పనులని ఇష్టారీతిన చేపట్టారు. నాసిరకం మెటీరియల్, నాణ్యత లేని పనులు చేసి రోడ్లకు ఎప్పటిలాగే కష్టాలు మిగిల్చారు. మంత్రి అనుచరుడు, ఎమ్మెల్యేల మనుషులే దాదాపు కాంట్రాక్టర్ల అవతారమెత్తి నాసిరకం పనులతో నిధులు స్వాహా చేసేశారు. మరమ్మతుల పనులపై క్వాలిటీ చెక్ ఉండదు, అధికారులు సైతం పెద్దగా పట్టించుకోరని ఇష్టారీతిన కానిచ్చేశారు. ఇంకేముంది ఇప్పుడా రోడ్ల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. మరోసారి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

తమ్ముళ్లకు కాసుల వాన..

అటు మరమ్మతుల రోడ్లు, ఇటు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టిన రోడ్లు.. తెలుగు తమ్ముళ్లకు కాసులు కురిపించాయి. దాదాపు రూ.185కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఉపాధి రోడ్లలో ఏ రకంగా నిధులు మింగేశారో జిల్లా ప్రజలంతా చూస్తున్నారు. బాగున్న రోడ్లపై కొన్నిచోట్ల రోడ్లు వేయగా, మరికొన్నిచోట్ల నాసిరకం రోడ్లు వేసి నిధులు స్వాహా చేశారు. ఇంకొన్నిచోట్ల అయితే ఏకంగా నాయకుల పొలాలకు, ఫాంహౌస్‌లకు, కొబ్బరితోటలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రోడ్లు వేసుకుని లబ్ధిపొందారు. సొంత అవసరాలకు, స్వప్రయోజనాలకు రోడ్లు వేసుకుని ఉపాధి నిధులను దుర్వినియోగం చేశారు. ఇదే విధంగా మరమ్మతుల కింద ఖర్చు చేసిన రూ.31 కోట్ల రోడ్ల నిధులను సైతం కొల్లగొట్టారు. వర్క్ ఏదైనా సొమ్ము చేసుకోవడమే పనిగా పెట్టుకుని పథకం ప్రకారం దోపిడీకి పాల్పడ్డారు.

అంతా మా ఇష్టం



ఇందిరానగర్‌లో అపార్ట్ మెంట్ పనులు జరుగుతున్న దృశ్యం

- నరసన్నపేటలో ఆగని అపార్ట్‌మెంట్ పనులు
- సుడా ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ బుట్టదాఖలు
- ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న పంచాయతీ, సుడా అధికారులు

నరసన్నపేట: స్థానిక ఇందిరా నగర్‌లోని బిల్డింగ్ సొసైటీ స్థలంలో సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణ పనులు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అనుమతులు పూర్తి స్థాయిలో లేకపోయినా, సుడా అధికారులు పనులు ఆపాలని ఆదేశించినా, సొసైటీ పాలక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా నిర్మాణదారులు మాత్రం అంతా మా ఇష్టం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. దీనిపై పంచాయతీ, సుడా అధికారులు మీరు ఆపండి అంటే.. మీరే ఆపండి అంటూ వంతులేసుకుంటూ తప్పించుకుంటున్నారు. అపార్ట్‌మెంట్ నిర్మాణ దారులు సుడాకు దరఖాస్తు చేయడం, వారు మొదట వర్క్ ఆర్డర్ ఇవ్వడం, వివాదాల నేపథ్యంలో మళ్లీ ఆ ఆర్డర్ రద్దు చేసి వర్క్ స్టాప్ ఆర్డర్ ఇవ్వడం తెలిసిందే. అయినా శుక్రవారం పనులు యథావిధిగా నిర్వహించారు. దీనిపై అధికారులెవరూ స్పందించపోవడం గమనార్హం. సత్యవరం కూడలిలో ఇలాంటి నిర్మాణం విషయంలోనే సుడా అధికారులు, పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు పెట్టి మరీ పనులు ఆపించారు. కానీ ఇక్కడ మాత్రం ఏమీ చేయడం లేదు. అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్న విషయాన్ని సుడా ప్లానింగ్ ఆఫీసర్ అమరనాథ్ దృష్టికి తీసుకువెళ్లగా తాము స్టాప్ ఆర్డర్ ఇచ్చామని, పనులు జరుగుతుంటే పంచాయతీ కార్యదర్శి ఆపాలని, వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పంచాయతీ ఈఓ ద్రాక్షాయినిని సంప్రదించగా సుడా నుంచి తమకు సమాచారం రాలేదన్నారు. రాత పూర్వకంగా ఇస్తే వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు.

కొండపై మరణ శాసనం



మూడు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. క్వారీలో పనంతా ముగించుకుని కాసేపటిలో కొండ దిగిపోతామనుకున్న ముగ్గురు కార్మికుల బతుకులు కొండపైనే తెల్లారిపోయాయి. ఈ మరణాల వెనుక కారణాలు మాత్రం అంతుచిక్కడం లేదు. పిడుగుపాటుకు గురై కార్మికులు చనిపోయారని క్వారీ యాజమాన్యం చెబుతోంది. కానీ క్వారీలో జరిగిన బ్లాస్టింగ్ వల్లనే కార్మికులు చనిపోయారని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి ఉండడం, కుటుంబ సభ్యులు వచ్చేలోగానే కొండ కిందకు దించడానికి ప్రయత్నించడం వంటివి వారి అనుమానాలను బలపరుస్తున్నాయి.

- క్వారీలో మృత్యువాత పడిన ముగ్గురు కార్మికులు
- పిడుగు పాటే కారణం అంటున్న యాజమాన్యం
- బ్లాస్టింగ్ వల్లే చనిపోయారంటున్న కుటుంబ సభ్యులు
- క్వారీ వద్ద ఆందోళన



అప్పన్న (ఫైల్) | తిర్లంగి రాము (ఫైల్) | ఆర్ముగం (ఫైల్)



సంఘటనా స్థలంలో బంధువుల ఆందోళన

టెక్కలి, మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపంలో గల సర్వే నంబర్ 13లో దబ్బగూడ కొండపై మానీష్ కూనపురెడ్డి గ్రానైట్ క్వారీలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 4:30 గంటల మధ్యలో ముగ్గురు కార్మికులు మృత్యువాత పడిన సంఘటన ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన బడబందల అప్పన్న (43), తిర్లంగి రాము (45), తమిళనాడుకు చెందిన పుంగవేణు ఆర్ముగం (48) కొండపై చనిపోయారు. ఈ సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపి.. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వచ్చేలోగానే మృతదేహాలను కిందకు దించేశారు. అయితే మృతదేహాలు పూర్తిగా కాలిపోయినట్లు కనిపించడంతో వారి మృతిపై పెద్ద ఎత్తున అనుమానాలు రేకెత్తాయి. పిడుగుపాటు కారణంగా కార్మికులు మృత్యువాత పడినట్లు యాజమాన్యం చెబుతున్నప్పటికీ క్వారీలో బ్లాస్టింగ్ జరగడంతోనే కార్మికులు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఇదే అనుమానంతో వారంతా క్వారీ వద్ద ఆందోళనకు దిగారు. మరో వైపు పాతపట్నం సీఐ వి.రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్‌బాబు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం సంభవించిన సమయంలో అక్కడే ఉన్న తోటి కార్మికులు జన్ని సిద్ధార్థ, వాసెట్టి బాలకృష్ణ తదితరులను విచారించి వివరాలు సేకరించారు. క్వారీలో కార్మికులు పిడుగుపాటుకు మృతి చెందారా లేక బ్లాస్టింగ్ వల్ల మృతి చెందారా అనే విషయం పూర్తి స్థాయి దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఇదీ మృతుల కుటుంబ నేపథ్యం

మృతుల్లో అప్పన్న, రాముల స్వగ్రామం టెక్కలి మండలం పోలవరం. కానీ వీరు కోటబొమ్మాళిలో నివాసం ఉంటున్నారు. ఇటీవలే దీనబంధుపురం క్వారీలో పనికి చేరారు. అక్కడ్నుంచే రోజూ కోటబొమ్మాళికి రాకపోకలు సాగిస్తున్నారు. అప్పన్నకు భార్య మంగమ్మ, కుమారుడు హరికృష్ణ, కుమార్తె కీర్తన ఉన్నారు. వీరు కోటబొమ్మాళిలో చదువుతున్నారు. రాముకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు సంతోష్, జగదీశ్ ఉన్నారు. వీరు కోటబొమ్మాళిలో చదువుతున్నారు. మృతుడు పుంగవేణు ఆర్ముగం తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి. 20 ఏళ్లుగా టెక్కలిలో నివాసం ఉంటున్నారు. ఈయనకు భార్య జయంతి, కుమార్తె దివ్య, కుమారుడు దినేష్ ఉన్నారు. రెండేళ్ల క్రితం కుమార్తెకు వివాహం జరిగింది.

శోకపు దారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

రెండు రోడ్డు ప్రమాదాలు మూడు కుటుంబాల్లో శోకం మిగిల్చాయి. కుటుంబ బాధ్యతలు భుజానికెత్తుకున్న పెద్ద కొడుకును మృత్యువు కర్కశంగా తీసుకెళ్లిపోయింది. ఊరంతా పండగ హడావుడిలో ఉండగా.. ఆ కబురు చెప్పడానికి వెళ్లిన ఇద్దరిని చావు మింగేయడంతో గ్రామమంతా శోకమయమైంది. పండగను కూడా ఈ ఏడాదికి వద్దనుకుంది.

వేడుకల వేళ విషాదం



మల్లేశ్వరరావు (ఫైల్)




అప్పన్న (ఫైల్)



కోటబొమ్మాళి మండలం చలమయ్య పేట గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. చలమయ్యపేట గ్రామ దేవత పాలపోలమ్మ తల్లి గ్రామ దేవత సంబరాలను ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దానిలో భాగంగానే గ్రామానికి చెందిన చెల్లూరి మల్లేశ్వరరావు(45), అంగ అప్పన్న(45) అనే ఇద్దరు బైక్‌పై సంబరాల ఆహ్వాన పత్రికలు పంచేందుకు వెళ్లి తిరిగి గురువారం రాత్రి వస్తుండగా.. తమ గ్రామం వద్ద ఉన్న డివైడర్‌ను దాటే క్రమంలో కోటబొమ్మాళి నుంచి టెక్కలి వైపు అతి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశ్వరరావు మృతిచెందాడు. మరో వ్యక్తి అప్పన్నను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ కు తరలించగా.. అక్కడ మృతి చెందాడు. మృతులిద్దరూ లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. అప్పన్నకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మల్లేశ్వరరావుకి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామ దేవత పండుగలు ప్రతి ఐదేళ్లకు ఓ మారు జరుగుతాయి. అయితే మొదటి ముర్రాట(దేవర) తీసుకువెళ్లే వ్యక్తి అప్పన్న చనిపోవడంతో పండగలను ఏడాది పాటు వాయిదా వేశారు.

– టెక్కలి రూరల్

ఆశల దీపం ఆరిపోయింది



సమీర్ (ఫైల్‌ఫోటో)

తమ్ముడిని బాగా చదివించాలని ఆశ పడ్డాడు. చెల్లెలిని చక్కగా చూసుకోవాలని ఎన్నో కలలు కన్నాడు. కానీ విధి రాత మరోలా ఉంది. 22 ఏళ్ల చిన్న వయసులోనే మృత్యువు అతడిని తీసుకెళ్లిపోయింది. అంతర్ రాష్ట్ర రహదారిపై జమ్ము సమీపంలోని శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సారవకోట మండలం బురద కొత్తూరుకు చెందిన జరజాన సమీర్ మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో గడ్డెయ్యపేట జగనన్న కాలనీకి చెందిన చౌదరికి గాయాలయ్యాయి. బురదకొత్తూరుకు చెందిన సమీర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పొందూరు వద్ద ఒక గ్రామంలో బంధువుల ఇంటిలో గురువారం పెళ్లికి వెళ్లి శుక్రవారం ఉదయం తిలారులో ట్రెన్ దిగి జమ్ము వచ్చాడు. అక్కడే సమీప బంధువు ప్రశాంత్ ఇంట్లో టిఫిన్ చేసి ప్రశాంత్ బైక్‌పై కల్లట గ్రామానికి బయల్దేరాడు. అక్కడ తన మేనత్త జ్యోతి 12 రోజుల కార్యానికి వెళ్లమని తండ్రి చెప్పడంతో బయల్దేరాడు. కొద్ది దూరం వెళ్లగా వెనక నుంచి చౌదరి అనే వ్యక్తి బైక్‌పై సమీర్‌ను ఓవర్ టేక్ చేయబోయే క్రమంలో బైక్‌లు ఒకదానికి ఒకటి తాకడంతో బళ్లు అదుపు తప్పాయి. దీంతో మందాలమ్మ గుడి వద్ద ఆగి ఉన్న లారీని సమీర్ బలంగా ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. చౌదరికి కాలు విరిగింది. నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

– నరసన్నపేట

క్లుప్తంగా

పాత నేరస్థులపై నిఘా



టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టెక్కలి: టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా వేయాలని, రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. ఆయనతో పాటు సీఐ విజయకుమార్, సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్‌కు వడదెబ్బ



కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యుగంధర్ శుక్రవారం బందోబస్తు విధుల్లో ఉండగా ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురయ్యారు. వెంటనే తోటి సిబ్బంది స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కుప్పకూలిన ఉపాధి వేతనదారుడు

టెక్కలి: సీతాపురం పంచాయతీ వలియాసాగరం గ్రామంలో శుక్రవారం ఉపాధి పని చేస్తున్న పైల ధనుంజయరావు ఒక్కసారిగా కుప్పకూలి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తోటి వేతనదారులు ధనుంజయరావును టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఏపీఓ ప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని వేతనదారుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఇదే పంచాయతీలో ఇటీవల క్షేత్ర సహాయకుడి తొలగింపు విషయంలో రాజకీయం ప్రమేయం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఇన్‌చార్జి క్షేత్ర సహాయకుడు నియామకం విషయంలో మండల స్థాయి అధికారులు జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేశారంటూ పలువురు వేతనదారులు చెబుతున్నారు. ఇప్పుడు జరిగిన సంఘటనతో సీతాపురం పంచాయతీ ఉపాధి హామీ పనుల్లో మరోసారి రచ్చ చోటుచేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలం వద్ద క్షతగాత్రులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నరసన్నపేట నుంచి కోటబొమ్మాళి వైపు వెళ్తున్న లాగేజ్ వ్యాన్ హరిశ్చంద్రాపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ఎస్.ఉమా, పి.లోకేష్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తయ్యేనా?



ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వద్ద జరుగుతున్న ఎర్త్‌బండ్ పనులు

- ఎట్టకేలకు ఆఫ్‌షోర్ పనులు పునఃప్రారంభం
- అంచనాలు పెరగడమే తప్ప పూర్తికాని వైనం
- ఎక్కడికక్కడే నిర్వాసితుల సమస్యలు

పలాస: మండలంలోని రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ఎట్టకేలకు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎప్పటికప్పుడు పనులు ప్రారంభించడం .. కొన్నాళ్లు కొనసాగడం.. తర్వాత నిలిచిపోవడంతో పరిపాటిగా మారింది. అరకొర నిధులు నేపథ్యంలో ఈసారి కూడా పనులు పూర్తయ్యేది అనుమానమేనన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌వద్ద ఎర్త్ బండ్ పనులు జరుగుతున్నాయి.

17 ఏళ్లుగా కొనసాగుతూ..

రేగులపాడు నుంచి నందిగాం, మెళియాపుట్టి మండలాలకు ఆర్.ఎం.సి, పలాస మండలానికి ఎల్.ఎం.సి కాలువల ద్వారా మొత్తం 24,500 ఎకరాలకు సాగునీరు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీరు అందించేందుకు 2008లో రూ.128 కోట్ల అంచనా వ్యయంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులకు రూ.456 కోట్లు అంచనా వేశారు. అయినా పనులు మాత్రం జరగలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 2021లో ఈ పనులకు రూ.850 కోట్లు అంచనా వేసి పనులు ప్రారంభించారు. ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పునరావాసాలు కల్పించారు. రిజర్వాయర్ సంబంధించిన పనులు కూడా కొంతమేర జరిగాయి. తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓటాన్ అకౌంట్ బడ్జెటులో రూ.30 కోట్లు కేటాయించారు. తాజాగా ఇప్పుడు మరో రూ.90 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఎర్త్ బండ్ పనులు ప్రారంభమయ్యాయి. మెళియాపుట్టి మండలం చాపర వద్ద మహేంద్రతనయ నది నుంచి వరద కాలువను 13.6 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ఇందులో 7 కిలోమీటర్ల పని పూర్తి చేశారు. మిగిలినది అసంపూర్తిగా ఉంది. ప్రస్తుతం ఎర్త్ బండ్ పనులతో పాటు కుడికాలువ మెయిన్ కెనాల్ పనులతో పాటు వరదకాలువలో డీవాటరింగ్ పనులు చేపడుతున్నారు. మరోవైపు, సుమారు 17 ఏళ్లు పూర్తవుతున్నా నిర్వాసితుల సమస్యలు ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టుతో పాటు నిర్వాసితుల సమస్యలు ఎప్పటికి పూర్తవుతాయో వేచి చూడాల్సిందే.

సగం భూమి పోయింది..



తాతలతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి 3 ఎకరాలు. ఇందులో ఎకరాన్నర భూమి రిజర్వాయర్‌లో కలిసిపోయింది. ఇల్లు పోయింది. 2008లో ఎకరాకు రూ.2.30 లక్షలు ఇచ్చారు. అవి అప్పుడే ఖర్చయిపోయాయి. ఉన్న భూమి వదల్లేను. ఇక్కడ ఉండటానికి ఇల్లు లేదు.

– దాసరి తాతారావు, రైతు, రేగులపాడు, పలాస మండలం

వచ్చే ఏడాదికి నీరు నిల్వ



వచ్చే ఏడాది జూన్‌కల్లా ఆఫ్‌షోర్‌లో 0.521 టి.ఎం.సిలు నీటిని నిల్వ చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ఆ దిశగా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఆఫ్‌షోర్ సామర్థ్యం 1.864 టి.ఎం.సిలు. అందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. రోజుకు 8000 క్యూబిక్ మీటర్ల మట్టిపనిని చేస్తున్నాం. ఇప్పటి వరకు 45 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

– బి.శేఖరబాబు, ఈఈ, వంశధార ప్రాజెక్టు

తనయుడికి తలకొరివి పెట్టిన తల్లి



తలకొరివి పెడుతున్న తల్లి లక్ష్మి

సంతబొమ్మాళి: కన్న కొడుక్కి తల్లి తలకొరివి పెట్టిన ఘటన సంతబొమ్మాళి మండలం సుగ్గువానిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆకాశలక్కవరం పంచాయతీ సుగ్గువానిపేట గ్రామానికి చెందిన పైల శాంతారావు (22) అనే యువకుడు 15 రోజుల క్రితం వరికోత మిషన్‌తో కలిసి లారీలో వలస కూలీగా రాజమండ్రి వెళ్లారు. వరి కోతలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద డ్రైవర్ నిద్ర వస్తుందని వాహనం ఆపి నిద్రపోయారు. శాంతారావు డ్రైవర్‌కు చెప్పకుండానే లారీ కింద నిద్రపోయాడు. ఇతనిని గమనించని డ్రైవర్ గురువారం వేకువజామున లారీ తీయడంతో శాంతారావు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చారు. తండ్రి లేకపోవడంతో తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తలకొరివి పెట్టారు. రోడ్డు ప్రమాదంపై నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు అధ్యక్షతన ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయ సమీపంలో ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం మొదలవుతుందని చెప్పారు. 2025–26 సీజన్‌లో అథ్లెటిక్స్ ఎంపికలు, పోటీల నిర్వహణ తదితర అంశాలతోపాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు) హాజరవుతున్న ఈ సమావేశానికి సంఘ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 30 రోజుల పాటు ఎల్ఎంవీ కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రామ్‌జీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. 10వ తరగతి కనీస విద్యార్హత కలిగి, ఫోర్ వీలర్ ఎల్ఎల్ఆర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని చెప్పారు. ఈ నెల 26 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, పూర్తివివరాలకు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాతా శిశు మరణాలు తగ్గాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మాతా శిశు మరణాల రేటు తగ్గాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతా శిశు మరణాలపై వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 4 నెలల్లో జరిగిన 12 శిశు మరణాలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎంహెచ్ఓ కె.అనిత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రాందాస్, డీపీహెచ్ఎన్ఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

క్యాట్ ఫలితాల్లో జయశంకర్ ప్రతిభ



జయశంకర్‌కృష్ణ

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని బి.ఆర్.నగర్‌కు చెందిన యజ్జల జయశంకర్ కృష్ణ ఇటీవల వెలువడిన క్యాట్(సీఏటీ) ఫలితాలలో జాతీయ స్థాయిలో ఆరో స్థానం సాధించి ప్రతిష్టాత్మకమైన ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) ముంబై క్యాంపస్‌లో సీటు సాధించాడు. ఈ యువకుడు ఆంధ్ర యూనివర్సిటీలో 2024లో బీటెక్ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణుడై ఫెడరల్ బ్యాంకులో ఉద్యోగానికి సైతం ఎంపికయ్యాడు. అయితే ఐఐఎంలో చదవాలనే కోరికతో ఉద్యోగాన్ని వదులుకుని, తాజాగా సీటు సాధించినట్లు తెలిపాడు. తండ్రి వరప్రసాదరావు పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో గ్రేడ్-1 ఈఓగా, తల్లి ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పనపై దృష్టి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి 12 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధా, బీసీ కార్పొరేషన్ అధికారి గడ్డెమ్మ, విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడీ కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

స్లాట్.. చాలా లేట్!

- టైమ్ స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్లకు తప్పని పాట్లు
- గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని భూ క్రయవిక్రయదారుల ఆవేదన



ఇచ్ఛాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జనాలు

ఇచ్ఛాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా తీసుకొచ్చిన టైమ్ స్లాట్ విధానంతో భూమి కొనుగోలు, అమ్మకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే భూక్రయ, విక్రయదారులు తాము నమోదుచేసుకున్న సమయానికంటే ముందుగానే చేరుకుని గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయించాలంటే ముందుగానే స్లాట్ కోసం ఫీజు చెల్లించి సమయం నమోదు చేసుకోవాలని, ఆ సమయానికి తమలో ఎవరు లేకపోయినా, నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోయినా, డాక్యుమెంట్ సరిగా లేకపోయినా, ఆలస్యం జరిగినా రిజిస్ట్రేషన్ జరగడం లేదని చెబుతున్నారు. స్లాట్ మొదటిసారి రిజిస్ట్రేషన్ ఉచితం అయినా పని జరగడంలేదని, రెండోసారి స్లాట్ నమోదుకు రూ.200 కాగా, మూడోసారి నమోదుకు రూ.800 ఫీజు చెల్లించాల్సి వస్తుందని తెలియజేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో భోజన విరామం వల్ల కొంత సమయం పోతుందని, ఫలితంగా రోజుకు ముప్పై రిజిస్ట్రేషన్‌లు వరకు మాత్రమే జరుగుతున్నట్టు చెబుతున్నారు. గతంలోఇలా ఉండేదికాదని, ఎన్ని రిజిస్ట్రేషన్‌లైనా సాఫీగా జరిగిపోయేవని అంటున్నారు. ఇచ్ఛాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 23 వార్డులు, ఇచ్ఛాపురం మండలంలోని 21 పంచాయతీలతోపాటు కవిటి మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతుండటం వల్ల స్లాట్ నమోదు కష్టమవుతున్నట్టు డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు.

వివాహ రిజిస్ట్రేషన్లకు తప్పని పాట్లు

ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్‌కార్డుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడంతో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సైతం స్లాట్ విధానం తిప్పలు తప్పడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డుకు వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జత చేయాలని నిబంధన విధించడంతో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చిన్న పిల్లలతో కలిసి ఎండలోనే కూర్చుంటూ బారులు తీరుతున్నారు.

నిబంధనల మేరకే..



ప్రభుత్వ నిబంధనల మేరకే భూ, వివాహ రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. స్లాట్ విధానంలో ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. నిర్దేశిత సమయానికి సంబంధిత వ్యక్తి తప్పనిసరిగా హాజరుకావాల్సిందే.

– కె.తవిటినాయుడు, సబ్ రిజిస్ట్రార్, ఇచ్ఛాపురం

రైతు ఆత్మహత్యలపై చర్యలేవీ..?

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీఎస్ కృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మానవహక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు

కంచిలి: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లాలో ఆత్మహత్యలపై ప్రభుత్వ చర్యలు లేకపోవడంపై తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక సంయుక్త కార్యదర్శి వీఎస్ కృష్ణ ప్రశ్నించారు. మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కంచిలి మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో శుక్రవారం పర్యటించారు. అనంతరం కంచిలిలో విలేకరులతో మాట్లాడారు. ఈ గ్రామానికి చెందిన కౌలు రైతు బల్లెడ నర్సింహమూర్తి ఏప్రిల్ 9వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడని, పంట కోసం చేసిన అప్పులు తీర్చలేకనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని వారు తెలిపారు. ఇతనికి ఇంత వరకు ప్రభుత్వం నుంచి ప్రభుత్వ సాయం అందలేదని, కనీసం రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులతో త్రిసభ్య కమిటీతో విచారణ కూడా చేపట్టలేదని వెల్లడించారు. ఇలాంటి ఆత్మహత్యలు జరిగితే ఆర్డీఓ, డీఎస్పీ, వ్యవసాయశాఖ ఏడీలు విచారణ చేపట్టి, కలెక్టర్‌కు నివేదిక పంపిస్తే, అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తే వారం రోజుల్లో రూ.7లక్షలు పరిహారాన్ని మృతుని కుటుంబానికి ఇవ్వాలని జీఓ ఉందని కృష్ణ గుర్తు చేశారు. వ్యవసాయ మంత్రి జిల్లాలోనే రైతు ఆత్మహత్యలపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. జిల్లాలో గత తొమ్మిదేళ్లలో 17 ఆత్మహత్యలు జరిగాయని, కవిటి, కంచిలి, నందిగాం, పలాస ప్రాంతాల్లో నాలుగు ఆత్మహత్యలు జరిగాయని రాష్ట్ర రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో–కన్వీనర్ బాలు అన్నారు. పెద్దకొజ్జిరియా కౌలు రైతు, మృతుడు బల్లెడ నర్సింహమూర్తి 12 ఎకరాలు వరకు జీడిమామిడి కౌలుకు తీసుకొని నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. కొత్త ప్రభుత్వం ఆత్మహత్య కేసులను పట్టించుకోవడం లేదన్నారు.

ఉద్దానంలో కిడ్నీ మరణాలతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతుండడం బాధాకరమన్నారు. పంటలను వేధిస్తున్న తెల్లదోమ నివారణకు కూడా యంత్రాంగం చర్యలు తీసుకోలేదన్నారు. అన్నదాత సుఖీభవ ప్రస్తావన కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణలో మానవ హక్కుల వేదిక విశాఖపట్నం జిల్లా ప్రతినిధి కె.అనురాధ, మానవహక్కుల వేదిక అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీరావు, మరో నేత తామాడ అరుణ తదితరులు పాల్గొన్నారు.

నల్లి ధర్మారావుకు సాహితీ పురస్కారం



నల్లి ధర్మారావు

శ్రీకాకుళం కల్చరల్: కవి, రచయిత, జర్నలిస్టు నల్లి ధర్మారావుకు విశాఖపట్నానికి చెందిన ఆచార్య చందు సుబ్బారావు సాహిత్య, సాంస్కృతిక సంస్థ అవార్డు ప్రకటించింది. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం పురస్కారానికి ధర్మారావును ఎంపిక చేశారు. ఈ నెల 18న ఉదయం 10గంటలకు విశాఖ సిటీ లైబ్రరీలో అవార్డును ప్రదానం చేయనున్నారు. ధర్మారావు కళింగాంధ్రా చరిత్ర, సంస్కృతి, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై అనేక వ్యాసాలు రాశారు. ఇప్పటికే గుర్రం జాషువా అవార్డు, రావి రంగారావు సాహిత్య పీఠం అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, దూసి ధర్మారావు అవార్డు వంటివి అందుకున్నారు. తాజాగా మరో సాహితీ పురస్కారం వస్తున్నందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జేఆర్‌పురం సీఐ అవతారం

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దకొత్తకోట ఎస్సీ కాలనీలో ఓ ఇంట్లో ఈ నెల 3న చోరీకి గురైన 2 తులాల 3 గ్రాముల బంగారం వస్తువులు, ఇత్తడి వస్తువులను రికవరీ చేసినట్లు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అదపాక గ్రామానికి చెందిన ముద్దాయి పిన్నింటి చంద్రరావు (పోలారావు) పాత కుంకాం గ్రామంలో మామిడితోటలో కాపలాగా ఉండేవాడు. తోడల్లుడు, మరో వ్యక్తితో కలిసి ఈ నెల 3న పెద్దకొత్తకోట గ్రామానికి వెళ్లి దొంగతనం చేశారు. డీఎస్పీ వివేకానంద ఆదేశాల మేరకు సీఐ అవతారం, లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు, సిబ్బంది రంగంలోకి దిగి క్లూస్‌టీం ఇచ్చిన సమాచారంతో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చంద్రరావు వద్ద ఇత్తడి సామాన్లు, అతని భార్య, మరదలు వద్ద బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చంద్రరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అదపాకలో పాత నేరస్తులు చాలా మంది నేరాలు చేయడం మానేసి కూలీ పనులు చేస్తూ బతుకుతున్నారని, కానీ కొందరు తిరిగి నేరాలు చేయడం ప్రారంభించారని చెప్పారు. దీనివల్ల గ్రామానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఇలాంటి వ్యవహారాలు మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మురపాకలో నాలుగు పూరిళ్లు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న యువకులు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గార రాములమ్మ, లావేటి లక్ష్మీ, మామిడి ఈశ్వరరావు, లావేటి రాములమ్మలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామాన్లు, రూ.70 వేలు నగదు, బంగారం కాలిపోయాయి. అందరూ ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. ముందుగా లావేటి రాములమ్మ ఇంటివద్ద మంటలు చెలరేగి వరుసగా ఉన్న ఇల్లు కాలిపోయాయి. స్థానిక యువత స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపుచేశారు. లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు నాలుగు ప్యాకెట్లు బియ్యం, రూ.2 వేలు తక్షణ సహాయం అందించారు. ఎంపీటీసీ ప్రతినిధి తేనెల సురేష్, స్థానిక నాయకులు మద్ది కనకయ్య, జల్లేపల్లి శారది తదితరులు సహాయక చర్యలు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ కొమరవానిపేట సమీప తోటల్లో శుక్రవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని జె.ఆర్.పురం పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.12,400 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

బాణసంచా దుకాణంలో చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఇబ్రహింబాద్ పంచాయతీ పరిధిలో కింతలి రోడ్డులో ఉన్న ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ (మందుగుండు సామగ్రి దుకాణం)లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఓ వ్యక్తి క్యాష్ కౌంటర్‌లో ప్రవేశించి తాళాలు పగల కొట్టి లాకర్‌లోని నగదు చోరీ చేశాడు. రూ.10 వేలు వరకు నగదు ఉంటుందని యజమానులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం షాపు వద్దకు వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించడంతో యజమాని వావిలపల్లి శ్యామలరావు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమేరా ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

100 లీటర్ల నాటుసారా స్వాధీనం



ఎక్సైజ్ స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న నాటు సారాతో ఎక్సైజ్ అధికారులు

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 100 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ జీవీ రమణ తెలిపారు. మండలంలోని బకుడ గ్రామంలో సవర లక్ష్మి వద్ద 70 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రాగుపురం గ్రామంలో 30 లీటర్ల నాటు సారాతో నర్తు హేమరాజును అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుజాత సిబ్బంది పాల్గొన్నారు.